# జమున వేసిన భారం

కొంతమందితో ఏళ్ళతరబడి పరిచయం వున్నాసరే- వాళ్ళను గురించి కొద్దిపాటికూడా తెలియకుండా కాలం జరిగి పోతుంది. కొంతమందితో పరిచయకాలం - చాలా తక్కువయినప్పటికీ ఏ పరిస్థితుల వత్తిడివల్లనో, మనకి అంతు చిక్కని మరింకే కారణంవల్లనో అవతలవాళ్ళ జీవిత రహస్యాలు తెలిసిపోతుంటాయి. ఆ రహస్యాలు పదిలంగా మన హృదయంలో ఒకచోట కప్పెట్టేస్తేనేగాని ఈ జీవితచక్రం నడవదు.

జమునాబాయి స్నేహంతో, నాకొక కొత్త దృక్పథం అలవాటయింది. జమునాబాయిని కలుసుకోక మునుపు నా కంటికి అద్దం - ప్రతిబింబం చూసుకునే అద్దంలా మాత్రమే - కనపడేది. ఆ అద్దానికి వెనక బిగించిన అట్టగురించిగానీ, అది తయారుచేసిన వాడికష్టం గురించిగానీ ఆలోచనలు వచ్చేవి కాదు. జమునాబాయితో స్నేహంఅయ్యాక, కంటికి ఏ చిన్న వస్తువు కనపడితే, ఆ వస్తువుని వస్తువుగా చూడక దాని వెనక ఎంత చరిత్ర వుండటానికి వీలువుంటుందో-అని ఆలోచించడం అలవాటయింది.

ం ం ం

గ్లాసుఫ్యాక్టరీలో జమునాబాయిభర్త ఇంజనీరుగానూ, మా వారు మేనేజరుగానూ వుంటూండేవాళ్ళు. జమున మన

దక్షిణాది మనిషికాదు. ఉత్తరాది స్త్రీ. ఆవిడకు తెలుగు రాదు. నాకు హిందూస్తానీ రాదు. కాని యిద్దరి మధ్య కామన్ భాష యింగ్లీషు వుండటంతో మా యిద్దరిమధ్యా స్నేహం అతి త్వరలో వృద్ధిపొందింది.

ముట్ట మొదటి రోజున మమ్మల్ని చూసేందుకు జమునా ఆవిడ భర్తా వచ్చారు. ఆనాటి జమున అందం నా కళ్ళని మిరిమిట్లు గొలిపింది. అంత అందమైన స్త్రీని మళ్ళీ నేను చూడలేదు.

జమున ఇంచుంచు భర్త అంతపొడవూవుంది. బంగారు రంగు శరీరం. కొనదేలిన ముక్కు, పెద్దకళ్ళు, అన్నిటికీమించి గోళ్ళకి వేసుకున్న లేతగులాబీరంగు నన్ను ఎక్కువ ఆకర్షించాయి. ముందు సంభాషణలో యిద్దరం కాస్త తడబడ్డా - తర్వాత మొగాళ్ళవల్ల - యిద్దరికీ వచ్చినభాష యింగ్లీషు వుందని తెలుసుకున్నాం. ఆపైన యిద్దరం సాధారణంగా ప్రతి రోజూ, కొన్నిగంటలు కబుర్లతో గడుపుతూండే వారం.

జమునలోని రెండు విశేషాలు నన్ను ఎక్కువ ఆకర్షించేవి. అందంగా వుండటం ఒకఎత్తు; ఆ అందం రెండింతలు అయేట్టు అలంకరించుకోడం మరోఎత్తు. నిజంగా అందాన్ని యినుమడింప జేసేట్టు అలంకరించుకోడం అనేది జమునకి ఒకత్తెకే తెలుసా?- అనిపించేది నాకు. ఆ అందానికి తగినట్లు వేషధారణ, దానికితోడు నిద్దట్లో లేపినా, చిరునవ్వుతో గిలిగింతలు పెట్టేటట్టు ఖబుర్లుచెప్పడం కూడా జమునసొత్తేఅని చెప్పాలి.

మా ఆరునెలల స్నేహంలోనూ జమున విచారంగా వుండడంగానీ, ఒకనాడూ నవ్వకుండా దిగులుగా వుండటంగానీ ఎన్నడూ చూసిఎరుగను. అసలు వాళ్ళయిల్లే - ఎంతో చల్లగా, నిర్మలంగా వుండేది. డ్రాయింగ్ రూములో ఒక పక్క సోఫాలు, మరోపక్క సెట్టి-దానిపైన పరిచిన కాశ్మీర్ సిల్కు-దుప్పటి, గదిలో ఒక టేబుల్, దాని పైన మూలగా రేడియో. పక్క చైనా పెయింటింగ్ చేసిన గాజు పూలకుండి. మొత్తంమీదగది అంతాఎంతో అమరికగా అందంగా వుండేది.

డ్రాయింగ్‌రూమ్‌లో సోఫాలూ; సెట్టీవున్నా మేమిద్దరం కిటికీ సిల్కు తెరలు తొలిగించి, కిటికీలోనే ఎక్కికూచుని ఖబుర్లాడుకునేవారం. ఆకిటికీలోకూచుని ఏవేవో మాట్లాడుతూ నవ్వుతూండేవారం. మధ్యమధ్య జమున దూరాన ఫ్యాక్టరీలోని కూలిలను చూపిస్తూ అందులోని వాళ్ళ సంసారాల గురించి - పుట్టుపూర్వోత్తరాల గురించి ఖబుర్లు చెపుతూండేది.

అసలు కూలీల విషయమేగాదు, పక్క గుమాస్తా భార్యల్లోకూడా నాకు ఏమీ యింటరెస్టు కలిగేది కాదు. అసలు వాళ్ళతో మాట్లాడాలనే ఆశక్తే వుండేదికాదు. అలాటిది జమున దూరాన ఫ్యాక్టరీలోకి వెళ్ళే కూలీల గురించి, వాళ్ళ భార్యలగురించి ఒకొక్కప్పుడు అతి విషాదమయినవీ, మరొకప్పుడు నవ్వు పుట్టించేవీ కథలు చెప్తూంటే-యీవిడకు యీ కథలన్నీ వినేవోపికా, తెలుసుకోవాలనే ఆసక్తీ ఎలా కలిగాయా అని ఆశ్చర్యంగా వుండేది నాకు. అందుకే జమున స్నేహంతో-గోడల్ని గోడలుగాకాక, ఆ గోడలవెనుక మగ్గే హృదయాల్ని వూహించుకోడం అలవాటయిందన్నాను. నాకు

ఫాక్టరీ కూలీలు నా కళ్ళకి పుత్తకూలీలుగా కనిపిస్తే, జమున కళ్ళకి మనమాదిరి సుఖదుఃఖాలు కలవాళ్ళలాగా కనిపించే వారు.

జమునని ఆమె భర్త ఒక దేవతలా పూజించి ప్రేమించే వాడు. అసలు వాళ్ళిద్దరి మధ్యా భేదాభిప్రాయం అన్నదే వుండేదికాదు. సాయంత్రంవేళ వాళ్ళ మేడమీద బాల్కనీలో కూచుని మా రెండు కుటుంబాలవాళ్లూ చూసిన సినిమాల్ని గురించీ, పరిచయస్తుల గురించీ - ఖబుర్లు చెప్పుకుంటుంటే గంటలు నిముషాల్లాగా గడచిపోయేవి.

బాల్కనీలో కూచున్న నా కంటికి జమునావాళ్ళ బెడ్ రూమ్, అస్తమిస్తున్న సూర్యుని బంగారు కాంతిలో తడిసిన ఆ బెడ్‌రూమ్, అతి సుందరంగా కనపడేది. అన్నిటికంటే ఆ రూమ్‌లో డ్రస్సింగ్ టేబుల్ మీదవున్న జమున పెళ్ళిఫొటో స్టాండ్ నా కంటిని చాలా సార్లు ఆకర్షించేది. ఆ ఫొటోస్టాండుని నేను చాలా రోజులదాకా బంగారుస్టాండు అనుకునేదాన్ని. చుట్టూ లతలూ, పువ్వులూ ఒకదానికొకటి పెనవేసుకున్నట్టు నగిషీ పనిగల ఆస్టాండు బంగారుదే అనుకునేదాన్ని. అందులో సాయంత్రపు సూర్యకిరణాలుపడి మెరుస్తూంటే అది అచ్చు బంగారమే అనిపించేది. కాని జమున చెప్పింది. అది బంగారం కాదని. వెండిదానిమీద బంగారు నీరుపూశాడట. అలాటి ఫ్రేము ఎక్కడకొన్నదో కనుక్కుందామని చాలాసార్లు అనుకున్నాను. కాని ఏమిటో అడగలేదు.

o o o o

మా దంపతులమధ్య చిన్న చిన్న భేదాభిప్రాయాలూ కోపాలూ వస్తూండేవి గాని - అదేమి చిత్రమో జమున యింట్లో ఏ వొక్కరోజూ కంఠాలు మామూలు స్థాయికి మించి వినిపించేవికావు. జమునని భార్యగా పొందడం తన అదృష్టం అంటూండేవారు ఇంజనీరుగారు. అందులో సందేహంలేదు. మేమంతాగూడా అట్లాగే అనుకునేవారం.

ఆనాడు ఆదివారం. ఆ ఆదివారం రెండు కుటుంబాల వారం కలిసి ఆ వూరికి యిరవైమైళ్ళ దూరంలో కొండల మధ్యవున్న లోయ దగ్గిరకు పిక్నిక్ వెళ్ళుదామని పదిరోజుల క్రితమే ప్రోగ్రాం వేసుకున్నాం. కారుమీద యిరవైమైళ్ళు వెళ్లాక, చిన్నలోయ, ఆ లోయపక్కనే సెలయేరు, చుట్టూ చెట్లు, అతి మనోహరంగా ప్రశాంతంగా వుండే ఆప్రదేశంలో ఒకరోజల్లా గడపాలనే మా నలుగురికోర్కె, ఆ ఆదివారం ఫలించింది.

అంతకి క్రితం రోజునే నేనూ జమునాకలిసి ప్రయాణానికి కావలసిన ఫలహారాలూ, టీ, బిస్కట్సు, కిరోసిన్ స్టవ్ ప్లేయింగ్స్ కార్డ్సు - యిలాంటి పరికరాలన్నీ సిద్ధంచేశాము. ఆదివారం పొద్దుటే బయలుదేరాం ఫ్యాక్టరీ కారుమీద. లోయదగ్గిరకు మైలుదూరమూ నడిచి వెళ్ళేసరికి ఎనిమిదిన్నర దాటింది.

ఆనాటి ఖబుర్లు, ఆటలు, తిండి నవ్వులు ఒక మరుపు రాని స్వప్నంలా నిల్చిపోయాయి నా మనసులో. సాయింత్రం మూడుగంటలదాకా, చాలా సరదాగా, జమున పాటల్తో - వాళ్ళాయన మిమిక్రీతో - మాఖబుర్లతో కాలం పరిగెత్తింది.

మూడున్నర దాటింది. అంతవరకూ నిర్మలంగావున్న ఆకాశం ఒక్కసారి నల్లబడిపోయింది.

తెచ్చిన సామాన్లు గబగబ సంచుల్లోకి పూర్తిగా సర్ద కుండానే-దబదబవర్షం ప్రారంభించింది. మొదట్లో నలుగురం ఆ చుట్టుపక్కలున్న చెట్లకింద కాసేపు నిలుచున్నాం. కొంత సేపటికి చెట్లకిందకూడా ధారాపాతంగా వర్షం పడటంతో యింక అక్కడ నుల్చునే వీలులేక - కారుదాకా, అంటే మైలుదూరం, ఆ పెద్దవర్షంలో సామాను యీడ్చుకుంటూ మేము నడవాల్సి వచ్చింది.

పాపం! జమునభర్త భయపడుతూనేవున్నారు. జము నకి ప్లూరసీ వుందిట. ఆవిడ నెత్తిమీద తనకోటు కప్పారు. కాని ఏంలాభం? ఆ కోటు పదిగజాలు నడవకమునుపే తడిసి పోయింది. ఆబరువుకూడా ఎందుకని జమున ఉత్తితలతో, తడి బట్టల్తో ఆ మైలుదూరం నడిచింది. అసలు ఆ వర్షంలో - జమున తన చిన్ననాటి ఆటలు, వర్షంలో తను ఎలా ఆడి తన్నులు తిన్నదీ - యిలాటి పిట్టకథలు చెప్పి నవ్వించకపోతే మాలో ఏ వొక్కరికీ అడుగు ముందుకి పడేది కాదనుకుంటూ వచ్చేటప్పుడు అరగంటలో నడిచిన మైలుదూరం, మేము వెళ్ళేటప్పుడు గంటన్నరసేపునడిచి కారుదగ్గిరకు జేరుకున్నాం.

నీళ్లు కారుతూ బురదమరకలైన తడిబట్టల్తో కారులో కూచున్నాం. ఆఖరికితలతుడుచుకునేందుకు టవల్‌గూడా లేక పోయింది. అన్నీ తడిముద్దలు. ఆ కుంభవర్షంలో కారుని అతి నెమ్మదిగా నడిపించాడు డ్రయివరు. యింటికి జేరేవేళకిదీపాలు

పెట్టారు. పెళ్లి వెళ్ళంగానే అందరికీ వంటమనిషి వేడి టీ నీళ్ళిచ్చింది.

° ° °

వర్షంలో తడవడంవల్ల సోమవారంనాడు కాస్త పడిశపు భారం చేసింది. అందుచేత ఆనాడు నేను యిల్లు కదలలేదు. మంగళవారం జమున యింటికి వెళ్ళే వేళకి - జమున మామూలుగా డ్రాయింగ్ రూమ్‌లో లేదు.

తిన్నగా మేడమెట్లెక్కి రూమ్‌లోకి వెళ్ళాను. మంచం మీద పడుకుని, చేతులో ఫోటోస్టాండ్ పట్టుకుని తదేకంగా చూస్తోంది జమున. నా అడుగుల చప్పుడు వినలేదు కాబోలు. ఆ ఫోటోని, ఫ్రేమునీ అతి మృదువుగా, చంటిపాపను తాకినట్టు వేళ్ళతో తాకుతోంది జమున. ఆ క్షణంలో ఆమెకళ్లు ప్రేమతో చమర్చి వున్నాయి. ఒక కన్నీటిబొట్టు బుగ్గమీదికి జారింది.

నాకా దృశ్యం చాలా ఆశ్చర్యం కలిగించింది. పెళ్ళయి అయిదేళ్ళయినా యింకా పెళ్ళిఫోటో చూసుకు ఆనంద భాష్పాలు రాల్చేవారుంటారా? అందుకే జమున భర్త అదృష్టవంతుడని మేమంతా అనడం. వాళ్ళిద్దరిమధ్యా ప్రేమ నిత్యనూతనంగా, ఏ మాత్రం తరగకుండా, పెళ్ళినాటి కంటె పదింతలు, ఎక్కువవుతోందేగాని, తక్కువవడం లేదు.

"ఫ్యాక్టరీ బాయ్‌ని పంపించనా? పాపం, విరహంలో పడి కొట్టుకుంటున్నావ్!" అన్నాను ఏడిపిస్తూ.

"అరె. నువ్వొచ్చావా! ఎంతసేపయింది?" అంది జమున తనని తాను సంబాళించుకుంటూ.

"ఎంత సేపయితే ఏంలే - అందుకే ఇంజనీరుగారు అదృష్టవంతుడు అంటూంట. ఇంతకీ ఆ ఫొటోలో కొత్త అందాలు కనపడ్డాయా? అన్నాను నవ్వుతూ.

"ఆ - అది నిత్యనూతనంగానే వుంటుంది" అంటూ ఫొటోని టేబుల్ మీదపెట్టి, పడుకున్నది లేచి, దిళ్ళనానుకుని ఏటవాలుగా కూచుంది జమున. నేను పక్కనున్న కుర్చీ లాక్కుని కూచున్నాను.

"అయితే నువ్వు నిద్రలేవగానే ముందు ఆ ఫొటోవంక చూసి - మరీ యింకోటి చూస్తావుటగా?"

"నీకెట్లా తెలుసు?"

"ఎల్లాగో అల్లా? చూస్తావా చూడవా చెప్పు?"

"కొందరు ఎవరి అరచేతిని వాళ్ళు చూచుకుంటారు. కొందరు తాళిని కళ్ళకద్దుకుంటారు. ఎవరిపిచ్చి వాళ్ళకానందం" అని చిరునవ్వు నవ్వింది జమున.

"ఒంట్లో ఎలావుంది? నాకు ఖబురంపించ లేదేం?"

"నిన్న నీకూ బాగా లేదుట! యివాళ ఎలాగా వస్తావు గదా అని వూరుకున్నాను" అంది జమున.

ఆ రోజు జమునకు నూటరెండు డిగ్రీల జ్వరంవుంది. సాయంత్రం నేను అక్కడ వుండగానే డాక్టరు వచ్చాడు. జమునని పరీక్షచేసి, వర్షంలో తడవటం, అందులోనూ ప్లూరసీ

కంప్లెయింట్ వున్న మనిషి కాబట్టి కాస్త జాగ్రత్తగా వుండాలని చెప్పాడు. దీపాలు పెట్టేదాకా వుండి యింటికొచ్చేశాను.

ఆ మర్నాడు త్వరగా భోజనం ముగించుకొని వెళ్లాను. నేను వెళ్ళేవేళకి యింజనీరుగారు యింట్లోనే వున్నారు. కిందటి రోజుకంటె జ్వరం మరో డిగ్రీ హెచ్చింది. ఆఫీసుకు వెళ్ళనా వద్దా అని ఆయన పస్తాయిస్తున్నారు. నేను ఆయన వచ్చే దాకా వుంటానని చెప్పాను. జమున పదిసార్లు చెప్పినమీదట ఆయన ఫ్యాక్టరీకి వెళ్ళారు. అంత జ్వరంలోనూ జమున నా కంటే ఉత్సాహంగా నవ్వుతూవుంది. మధ్యమధ్య ఫోటోని మటుకు తీసుకుని తదేకంగా చూస్తూండేది. నేను వేళాకోళం చేసేదాన్ని. చిరునవ్వునవ్వి వూరుకునేది.

ఆనాడూ మర్నాడూ అలాగే జరిగింది. మళ్ళీ ఆది వారం వచ్చింది. కాని జమున జ్వరంతగ్గలేదు. డాక్టరు రోజూ మూడుసార్లువచ్చి మందలిస్తున్నాడు. జ్వరం తగ్గుమొహాం పట్టలేదు. ఆ వారంలో మేము ఆ కొండల్నీ, లోయనీ, వర్షాన్నీ ఎన్నిసార్లు శపించి పోశామో లెఖ్ఖలేదు.

సోమవారం, అంటే ఆ వేళకి ఎనిమిది రోజులయింది. జమునకి జ్వరంవచ్చి ఒక వూపిరితిత్తి చెడిపోయిందని చెప్పాడు డాక్టరు. మా అందరికీ మనసులో ఏవేవో పిచ్చిభయాలుపట్టు కున్నాయి. వంటమనిషి – గది మారుస్తే తగ్గుతుంది – అంది. పక్క గుమాస్తా భార్య – జ్వరం మనిషికి స్థలంమార్పు అవస రం – అంది. ఆఫీసులో అసిస్టెంటుగారు – మేడమీద రిప్పున వీచేగాలి పనికిరాదన్నాడు. అన్నిటికీ మించి జమున చుట్టాల్ని

ఎవర్నీ రమ్మని రాయనివ్వలేదు. చుట్టాలంటే ఆమె అత్తింటి వారే వున్నారు - తల్లీ తండ్రీ లేరు జమునకి.

ఏమయితేనేం మంగళవారం డ్రాయింగ్‌రూమ్‌పక్కగా వున్న గది కడిగి, సాంబ్రాణీ పొగవేసి, మంచంపక్క అన్ని సదుపాయాలుచేసి, జమునని నేనూ ఆమె భర్తా పట్టుకుని నెమ్మదిగా కిందికి తీసుకొచ్చాము. ఆ రాత్రి తొమ్మిదింటి దాకా అక్కడే గడిపి, తెల్లవారి పొద్దుటే వస్తానని యింటి కొచ్చేశాను.

మర్నాడు నేనింకా నిద్దర్లోనే వున్నాను. తెల్లగా తెల్లవారేలేదు. తలుపు చప్పుడుతో వులిక్కిపడి లేచాను. వాళ్ళ పనిమనిషి నిల్చున్న పళంగా రమ్మన్నారని వచ్చాడు. మనసులో భయం, ఏదో ఆరాటం ఒక్కపరుగున వెళ్ళిపడ్డాను. మంచంమీద జమున, ఫ్రేములేని పెళ్ళిఫోటో చేతులోపట్టుకు ఏడుస్తోంది. పక్కన పేముకుర్చీలో యింజనీరుగారు తలపట్టుకు కూచున్నాడు.

ఏమిటని ఆదుర్దాగా ప్రశ్నించాను. రాత్రి జమునని కిందకి తీసుకురావడం హడావుడిలో డాబావైపునున్న తలుపు వెయ్యలేదు. ఏముంది ? బీరువాలోని కొన్ని సిల్కుచీరెలు, సొరుగులోవున్న కాష్, టేబుల్‌మీదవున్న ఫోటోస్టాండ్ దొంగ ఎత్తుకుపోయాడట. తెల్లవారుజామున కళ్ళు మూసుకునే, ఫోటో కోసం అడిగితే ఆయన మేడమీదకు తెచ్చేందుకు వెళ్ళారట. టేబుల్‌మీద ఫోటో ఒకటే ఉందిట. బీరువా తెరిచివుంది; సొరుగు లాగివుంది.

ఫ్రేము పోయినా ఫొటో అయినా వదలిన ఆ దొంగ ఔదార్యాన్ని మెచ్చుకుంటూ, ఆ ఫొటో భార్య చేతుల్లో పెట్టారుట. ఫ్రేము లేని ఫొటో చూసి, జమున కెవ్వున కేక వేసి పడి పోయిందట. నే వచ్చేము దే తేరుకుంది. అప్పటినుంచీ ఎంత సముదాయించినా ఏడ్పు మానటం లేదుట.

"వస్తువులు పోయినందుకుకాదు, జమున ఇలా ఏడుస్తుంటే ప్రమాదం. మీరైనా చెప్పండి, ఒక గంటలోయింకో మంచి ఫ్రేము కట్టించి ఎదురుగ్గా టేబుల్ మీద పెడ్తాను" అన్నారు ఇంజనీరుగారు.

నేను జమున పక్కన కూచున్నాను. నా చేతుల్లోకి ఆమె రెండు చేతుల్నీ పట్టుకుని వోదార్చాను. వెంటనే ఫ్రేము కట్టిస్తామని నచ్చజెప్పాను. జమున ఏడుపుమానలేదు. పూరికే ఏడుస్తోంది. అసలు నామాటలు విందో లేదో అని అనుమానం కలిగి, ఇంజనీరుగారిని చెప్పమన్నాను. అసలు జమున మా మాటలు వినే స్తితిలో లేదు. ఆమెకి స్పృహతప్పతోందనిమాకు లీలగాతోచి, ఆయన డాక్టరుకోసం పరిగెత్తారు. ఏడున్నరకి డాక్టరొచ్చాడు. పరిస్థితి ఆదుర్దాగావుందని తేల్చాడు. వెంటనే ఫొటోకి ఫ్రేమ్ కట్టించి తెప్పించి ఎదురుగ్గా పెట్టించమన్నాడు. తొమ్మిదింటికల్లా కొత్త ఫ్రేమ్ - చక్కటి ప్లాస్టిక్ ఫ్రేమ్‌తో - ఫొటో స్టాండ్ జమున కెదురుగ్గా టేబుల్ మీద పెట్టాము. జమున కళ్ళు తెరచి ఆవంక చూడలేదు.

పక్కవూరిలోవున్న పెద్దడాక్టరుకోసం - జమునభర్తా, డాక్టరూ యిద్దరూ వెళ్ళారు. వరండాలో మావారు యిటూ అటూ పచారుచేస్తున్నారు. వంటమనిషి ఆదుర్దాగా వంటింట్లో

తిరుగుతోంది. నవకర్లు బెరుగ్గా కంగారుగా వున్నారు. పదిన్నర కొట్టారు. జమున కళ్ళు తెరిచింది. నన్ను గుర్తుపట్టినట్టుగా క్షణకాలం తేరిపార చూసింది. ఒకసారి ఎదురుగావున్న ఫోటో స్టాండువంక చూసింది. ఆనందంతో ఆమెకళ్ళు విడిపడ్డాయనుకున్నాను–కాని కన్నీళ్ళు చెక్కిళ్ళ మీంచి జారుతున్నాయి. చీరకొంగుతో చెక్కిళ్ళు తుడిచి, ఏవేవో ధైర్యవచనాలుపలికాను. జమున వాటిని విన్నట్టుగా లేదు. నామణికట్టుని తన కుడిచేత్తో పట్టుకుంది. జమున చెయ్యి సల సల కాగుతోంది.

"నాకో సాయం జేస్తావా ?" అంది అతి సన్నగా.

"అల్లాగే" అన్నాను.

"బీరువాలో–" అంటూ ఆలోచిస్తోంది.

"పోయిన చీరెలకోసం నువ్వుబాధపడకు. నువ్వులేచాక అంతకు పదిరెట్లు మంచివి కొనుక్కోవచ్చు" అన్నాను.

"చీరెలకోసం కాదు. పోతేపోయాయి. బీరువాలో ..." అంటూ ఏదో జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్టు ఆగిపోయింది.

నేను నిశ్శబ్దంగా ఏంచెపుతుందా అని నిరీక్షిస్తున్నాను.

"జ్ఞాపకం వచ్చింది. కాయితం కలం తీసుకురా" అంది.

"ఇప్పుడు కాయితం ఎందుకూ? నీకు తగ్గాక రాసుకుందువు గానిలే. కాసేపు మాట్లాడకుండా పడుకో" అన్నాను బుజ్జగిస్తూ.

"చూడు అల్లాకాదు. నాకు జ్ఞాపకం తగ్గిపోతుంది. రాత్రంతా ఎన్నోసార్లు జ్ఞాపకం చేసుకుని – మర్చిపోయాను. ఇదినువ్వు రాసుకోవాలి" అంది బతిమిలాడ్తున్నట్టు.

జమున లాహోరులోవున్న ఒక ముస్లిమ్ అడ్రసు చెప్పింది. నేను నిజంగా జమునకి మతితప్పుతోందనుకున్నాను. కాని స్పెల్లింగ్ దగ్గరనుంచీ జాగ్రత్తగా చెప్పింది. అలాంటప్పుడు మతిలేని మాటలు అని ఎలా అనుకోడం ?

"ఇది ఏం చెయ్యను?" అన్నాను ఆకాయిం మడుస్తూ.

"నేను చచ్చిపోయాక, ఆసంగతిఅతనికి తెలియజెయ్యి" అంది అతిసహజంగా.

నాకు ఏడుపొచ్చింది. "ఛీ-అవేంమాటలు వూరుకో" అన్నాను.

"వూరుకోడం కాదు; చచ్చిపోతానని కాదు. కాని అతనికి చావుఖబురు తెలియక పోతుందేమోనని భయం. పూర్తిగా స్పృహతప్పక ముందే నీకు చెప్పాను. ఆ పైనవన్నీ నువ్వేచూసుకో" అంది కళ్ళుమూసుకుంటూ.

ఎవరు ? ఆముస్లిమ్‌కీ జమునకీవున్న సంబంధంఏమిటి ? అసలు జమున మన స్పృహలోవుండి మాట్లాడుతోందా ? యిలాటి ఆలోచనలతో నాబుర్ర గిరగిరతిరిగింది. మడిచినఅడ్రసుని గుప్పెట్లో పెట్టుకుని కూచున్నాను. ఇంతలోకేపోర్టికోలో కారాగింది.

కారులోంచి పెద్దడాక్టరూ - జమున భర్తా దిగారు.... పెద్దడాక్టరు జమునని చూశాడు. ఇంకో రెండురోజులు పేషెంట్ డెలీరియమ్‌లోవుంటుందన్నాడు. ఆ డెలీరియమ్‌నుంచి బయటపడ్తే బతికినట్టు లేకపోతే-లేదు,-అన్నట్టు తెల్చాడు.

జమునభర్త కుప్పలా కూలిపోయాడు. నా కాళ్ళకింద భూమి అదురుతున్నట్టనిపించింది.

*　　*　　*

జమునకి ఏవో రెండు యింజక్షనులిచ్చాడు డాక్టరు. రోజూ పొద్దుటా సాయంత్రం వస్తాననీ, గుండెలకి గాలి తగలకుండా పట్టీలు వెయ్యమనీ చెప్పివెళ్ళాడు.

మా కెవ్వరికీ నోట మాట రాలేదు. మనుషులం యంత్రాల్లా మాపని నిర్వర్తించుకుంటున్నాం. ఆ సాయంత్రం నాలుగున్నరదాకా జమునకి స్పృహ రాలేదు. నాలుగున్నరకి డాక్టరూ యింజనీరుగారూ వాకిట్లో మాట్లాడుకుంటున్నారు. నేను చిక్కిపోయిన ఆమె చెక్కిళ్ళనీ, జ్వరంతో కందిన ఆమె ఫాలభాగాన్నీ చూస్తూ కూచున్నాను.

జమున కళ్ళువిప్పి నావంక చూసింది. దగ్గరకు రమ్మన్నట్టు సౌజ్ఞ చేసింది. వెళ్ళి పక్కనకూచుని చెయ్యి పట్టుకున్నాను.

"నే నిచ్చిన అడ్రసు పారెయ్యకు" అంది నీరసంగా.

"అలాగే" అన్నాను.

"నాకు మతిలేదనుకుంటున్నావా? పూర్తిగా తెలివివుండే మాట్లాడుతున్నాను. అది మరో ప్రాణికి తెలీకుండా నీ దగ్గర ఉంటుందని యిచ్చాను" అంది.

"వూ..." అన్నాను.

"ఆ సంగతి ఆయనకు తెలిస్తే బతకరు."

"ఏ సంగతి?"

నాకు ఏదో కంగారుగా వుంది. యీ నవ్వే చిలిపి జమున హృదయంలో ఎంతటి బడబాగ్ని వుంది? ఎన్ని రహస్యాలు బంధింపబడి ఉన్నాయి?

"నా పెండ్లికిముందే అతను తెలుసు. యిద్దరం కలిసి చదివాం..." అని నీరసంగా ఆగిపోయింది.

కాసిని గ్లూకోజ్ నీళ్ళు చెమ్చాతో పోశాను. గుమ్మం లోకి యింజనీరుగారు ఆదుర్దాగా అడుగేస్తూ "లేచిందా?" అన్నారు.

ఇప్పుడు ఆయన కూచుంటే జమున చెప్పబోయే రహస్యం చెప్పే అవకాశం ఉండదు. జమున నాకు ఏవేవో చెప్పాలని ఆరాటపడుతోంది. నాకు వినాలనీ, నేను చెయ్యగలిగిన సాయంవుంటే చెయ్యాలనీ ఆదుర్దాగావుంది. ఇది సానుకూల పడేందుకు ఆయన్ని కాసేపు దూరంగా వుంచాలి.

"దాహం అంటే యిచ్చాను. తెలివివస్తే పిలుస్తాను. మీరు అలా గాలికి తిరిగిరాండి" అన్నాను ఆయనతో.

"అక్కర్లేదు. ఒకసారి కళ్ళుతెరిచి చూస్తుం దేమో, యిక్కడే వుంటాను..." అన్నారు.

"మీరు అలాపోర్టికోలో కూచోండి, నేను పిలుస్తాగా. మళ్ళీ రాత్రంతా మెళుకువగా వుండాలి. కాస్త స్నానంచేసి గాలికి కుర్చీ వేసుకు కూచోండి" అన్నాను.

ఆయన లేచి వెళ్ళారు. జమున కళ్ళు తెరిచింది. నా వూహాలూ, ఆమె వూహలూ ఒకటేనన్నమాట.

"వెళ్ళారా?" అంది సన్నగా.

"ఆ..."

"అతను ముస్లిమ్, నేను హిందువుని. ఇది పాతపాటే. నేను రోజూచూసేది పెళ్ళిఫోటో అనికదూ మీఊహ? నా కళ్ళు ఫోటోనుకాదు వెతికేది-ఫ్రేముని-ఆ ఫ్రేము అతను నా కిచ్చిన ప్రేమకానుక."

నా నోట మాటరాలేదు. ఎంతచిత్రం! లోకం అంతా కళ్ళకు కనపడేదాన్నే చూస్తుందిగాని దానివెనుకనున్న అర్థం గ్రహించదు. భర్త దగ్గరనుంచి బయట మనిషిదాకా జమున కళ్లుఫోటోని వెతుకుతున్నాయనుకున్నారు. ఆమెకళ్లు ఫ్రేముని జ్ఞాపకాలతో నిండిన ఆ ఫ్రేముని, ప్రతినిత్యం చూస్తున్నాయి. ఆనాటి కన్నీటిబొట్టూ, యీనాటి పొద్దుట వేసిన కేకా ఫోటో కోసంకాదు, ఫ్రేముకోసం.

"పెళ్ళయిన కొత్తలో వారిమీద అసహ్యం, కోపం కలిగేవి. యిక్కడికి రాగానే చెప్పేద్దామని అనుకున్నాను. ఆయనకి నామీద గొప్పప్రేమ, ఆరాధన. అంతా చెప్పినా ఆయన బాధపడతారేగాని, నన్ను వదిలెయ్యరు" అంది జమున.

"ఆ ఫ్రేము సంగతి ఆయనకి తెలుసా?"

"తెలియనే తెలియదు. కొత్తలో సిగ్గుఅనుకున్నారు. ఆపైన నాబాధని నవ్వులమధ్య కప్పెట్టాను...."

నేను మాటాడలేదు. ఏదో సినిమా చూస్తున్నట్టుగా వుంది.

"నేను పోయాకకూడా ఆయనకి నామీద యీ గౌరవమేవుండనీ. అసలు నేను మనసారా ఒకరిసొత్తునంటే ఆయన

చాలా బాధపడ్డారు. నా మరణవార్త అతనికి తప్పక తెలియ జేస్తావుగా!" అంది జమున.

నేను ఫోన్‌కొట్టి జమున భర్తని పిలిచాను. ఆయన ఒక అయిదు నిముషాలు మాట్లాడారు. వాళ్ళిద్దర్నీ చూస్తూవుంటే ఆ దాంపత్యం, అయిదేళ్ళ వారి వైవాహిక జీవితం, అంతా ఒక కలలా, అబద్ధంలా తోచింది. ఎక్కడో దూరాన కని విని ఎరగని ఆ ముస్లిమ్ యువకుడే "నిజం" అనిపించింది. జమునకి మళ్ళీ స్పృహరాలేదు.

ఆరాత్రి యింజనీరు పక్కవీధికి వెళ్ళారు. వసారాలో మావారు మంచంమీద పడుకున్నారు. నేను వాలుకుర్చీలో కూచున్నాను. బెడ్‌లాంప్ సన్నగా వెలుగుతోంది.

జమున ఏవేవో అర్థంలేని పిచ్చిమాటలు మాట్లాడు తోంది. అలా రెండురోజులు సంధిమాటలు మాట్లాడుతుం దని డాక్టరు చెప్పాడు. నాకు కన్ను మూతపడడం లేదు. కొన్నివందల మైళ్ళదూరంలోవున్న ముస్లిమ్ యువకుడికి నా మనోకాశంలో ఆకారం యిస్తున్నాను. జమున జీవితం, పైకి కనిపించే ఆ నవ్వుల జీవితం—అంతా కల్ల. ఇవన్నీ ఉత్తవి. అర్థవిహీనమైన రోజులు. అతనితో గడిపిన కొన్ని రోజుల్లో, క్షణాల్లో అవే ఆమెకి నిజం. వాటిని తల్చుకునే, ఆమె యిన్నాళ్ళూ జీవించింది. అతని తాలూకు ఫ్రేము, ఆ చివరి చిహ్నంగూడా పారేసుకుంది జమున. ఆమెనిచూస్తే- పాపం- అని జాలి పొర్లుకొచ్చింది.

పదకొండు కొట్టారు. జమున కళ్ళు తెరచింది. వెళ్ళి పక్కన నుల్చుని చెయ్యిపట్టుకున్నాను. నాచేతిమీద టప్పున

కన్నీటిచుక్క పడింది. అప్పటికిగాని నేను ఏడుస్తున్నట్టు నాకు తెలియ లేదు.

"అతనికి రాయి, నా ఆఖరి ఘడియలు - రాస్తావుగా?" అంది జమున. కంఠం సన్నగా నూతిలోంచి వినపడ్డట్టుగా వుంది...

"అల్లాగే" అన్నాను. నాకు దుఃఖం ముంచుకొస్తోంది.

"నాకు నిద్రవస్తోంది. పడుకుంటా" అంది జమున తల తిప్పి.

♦ ♦ ♦

ఇంజనీరుగారిని ఓదార్చలేక పోయాము. ఆమె చని పోయిన మర్నాడు, లాహోరులోని ఆ ముస్లిమ్ యువకుడికి జమున మరణవార్త తెలియబరిచాను. నా అడ్రసుకూడా రాశాను. ఇటువైపులకి వచ్చినపుడు నన్ను కలుసుకోమని కూడా రాశాను. జవాబుకోసం ఆత్రంగా ఎదురు చూశాను. గాని రాలేదు. నాకు తెలియని ఆ ముస్లిమ్ యువకుడు వస్తాడేమోనని యింకా చూస్తూనే వున్నాను. ఒకటి, రెండు, మూడు, నాలుగేళ్ళయింది. అతనూ రాలేదు, అతని దగ్గర నుంచి జవాబూ రాలేదు. జమున నా మీద వేసిన భారం అలాగే వుంది.

—o—